క్లుప్తంగా

ఎంపీ ఆదాలకు సత్కారం

నెల్లూరురూరల్ : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రటరీగా పద్మజాయాదవ్, జిల్లా మహిళా సెక్రటరీగా రమాదేవి నియమితులైన సందర్భంగా వారు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డిని ఆయన నివాసంలో శుక్రవారం కలిసి సత్కరించారు. డివిజన్ ఇన్‌చార్జిలు రావు శ్రీనివాసరావు, సురేష్‌బాబు, పార్టీ నేత భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, నాయకులు ఫయాజ్, శ్రీనివాసులురెడ్డి, గణేష్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



నెల్లూరు(బృందావనం) : ప్రతిభ గల విద్యార్థికి నిర్మల నరసింహారెడ్డి దంపతులు రెడ్ల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్తున్న సాయిప్రసాద్‌రెడ్డికి శాంతినగర్‌లోని నిర్మల సౌధలో శుక్రవారం రూ.50 వేలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్ల ఐక్యవేదిక నెల్లూరు ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీవీరెడ్డి, కోశాధికారి సింగారెడ్డి హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో జనరిక్ మెడికల్ షాప్



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని స్టౌన్ హౌస్‌పేటలో ఉన్న డీసీఎమ్మెస్‌కు చెందిన భవనంలో జనరిక్ మందుల దుకాణం త్వరలో ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన నిర్మాణ పనులను డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జనరిక్ మందుల దుకాణాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారు.

55 వేల లడ్డూల వితరణ నేడు

నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని రంగనాథస్వామి దేవస్థానంలో శ్రీరామహనుమాన్ భక్తబృందం ఆధ్వర్యంలో భక్తులకు 55 వేల డ్రైఫ్రూట్ లడ్డూలను, వెయ్యి కిలోల పులిహోరను భక్తులకు వితరణ చేయనున్నట్లు భక్తబృందం సభ్యులు పాదర్తి బాలాజీ, సాయిబాబా శుక్రవారం తెలిపారు. భక్తుల కోసం చీరాల నుంచి ప్రత్యేకంగా లడ్డూ ప్రసాదాన్ని తయారు చేయించినట్లు వివరించారు.

'బెన్' స్కూల్‌లో క్రిస్మస్

నెల్లూరు (టౌన్) : స్థానిక కొండాయపాళెం గేటు సమీపంలో ఉన్న బెన్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్ దాయాసాగర్ పండగ విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ పాల్ కోటి, ప్రిన్సిపల్ అనితాపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వసాయిలో రామానుజన్ జయంతి

నెల్లూరు (టౌన్) : స్థానిక మాగుంట లేఅవుట్‌లో ఉన్న విశ్వసాయి జూనియర్ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

టెక్నో ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు (టౌన్) : నగరంలోని కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో వచ్చేనెల 6న టెక్నోఫెస్ట్ విజ్ఞాన-2కే24ను నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్లు చంద్రశేఖరరెడ్డి, కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కళాశాల డీన్‌లు మల్లికార్జునయ్య, జ్యోతి, ప్రిన్సిపల్ ఎం.ప్రసాద్, ఎంసీఏ హెచ్‌ఓడీ ఫణికుమార్ పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ముస్తాబు



స్వామివారి విద్యుత్ కటౌట్



విద్యుద్దీపకాంతులతో ఆలయం

నెల్లూరు(బృందావనం) : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని (ముక్కోటి ఏకాదశి) పురస్కరించుకుని రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం ముస్తాబైంది. అధిక సంఖ్యలో వచ్చే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. భక్తుల కోసం ఉచిత, రూ.50, రూ.100 టిక్కెట్లతో స్వామివారి ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకునేందుకు బారికేడ్లు ఏర్పాట్లు చేశామన్నారు. సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ సూచనల మేరకు గతంలో రూ.500 టిక్కెట్‌ను రూ.100గా బదలాయించామన్నారు. స్వామివారి సన్నిధితో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్వామివారి చిత్రాలతో విద్యుద్దీపాల కటౌట్‌లను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.



ఆలయ ఆవరణలో..

'ఆడుదాం ఆంధ్రా' ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు (స్టౌన్‌హౌస్‌పేట) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' టోర్నమెంట్ ఏర్పాట్లను నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక ఏసీ సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న పనులను అధికారులతో కలిసి కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. ఈనెల 26వ తేదీ నుంచి జరుగనున్న పోటీల్లో క్రీడాకారులు, వీక్షకులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇండోర్, ఔట్‌డోర్ క్రీడల నిర్వహణకు అవసరమైన క్రీడా పరికరాలు, మైదానాల్లో ఏర్పాట్లు, స్టేడియం ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణ, క్రీడాకారులకు అవసరమైన వసతులు, రవాణా, ఆహార పానీయాలు, భద్రత తదితర అంశాలను పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, ఇంజినీరింగ్ ఎస్ఈ సంపత్‌కుమార్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.



ఆడుదాం ఆంధ్రా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (దర్గామిట్ట) : ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారామ్‌ను జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ్మినేని విజయవాడ నుంచి తిరుమల వెళ్తూ మార్గమధ్యలో నెల్లూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బస చేశారు. ఈ సందర్భంగా జేసీ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాకు సంబంధించి పలు విషయాలు చర్చించారు. ఆయన వెంట నెల్లూరు ఆర్డీఓ మలోలా, ఇతర అధికారులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన

నెల్లూరు (పొగతోట) : రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైన సౌత్‌మోపూరు పాఠశాల విద్యార్థులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ శుక్రవారం అభినందించారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో విద్యార్థులు రిషిత, షణ్ముఖప్రియ, రంజిత్‌కుమార్‌లను ఆమె ప్రత్యేకంగా అభినందించి, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్.అన్వర్ హుస్సేన్, సైన్స్ టీచర్ జి.శ్రీనివాస్, పిడి.నాగేంద్రరావు పాల్గొన్నారు.



పౌష్టికాహారం అందజేత



నెల్లూరు(బృందావనం) : నగరంలోని బాప్టిస్టు చర్చి డౌనీహాల్‌లో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పిల్లలకు, అనారోగ్యంతో బాధపడే వారికి శుక్రవారం పౌష్టికాహారం, దుప్పట్లు అందజేశారు. తొలుత సంఘ కాపరి రెవ. కంది శ్యామ్‌సన్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సంఘ కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్, ఎవాంజలిజమ్ డైరెక్టర్ గంటా జార్జి స్టీవెన్‌సన్, సంఘ పెద్దలు ప్రభుదాస్‌పాల్, వర కుమార్, పాస్టర్ శ్యామ్‌కుమార్, హుల్దా శ్యాంసన్ బ్లెస్సింగ్‌టన్, విజయపాల్, దినేష్, లాబాన్, దేవప్రసాద్, ఏలియా పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన పోటీలను శుక్రవారం నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు హెచ్‌ఎం మంజులవాణి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజమనోహర్, ఖాజారహమతుల్లా, ధనరాజ్, రమణయ్య, శారద, లక్ష్మీప్రసన్న, శ్రీకళ, రీనా తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్ల పంపిణీ



నెల్లూరు(బృందావనం) : నగరంలోని బోడిగాడితోట పరిసర ప్రాంతాల్లో 80 కుటుంబాలకు లివింగ్‌వాటర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో దుప్పట్లను శుక్రవారం పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ సభ్యులు బ్రదర్ జానిజో, విలియం శుభకర్, మహేష్, కల్యాణ్, సాయి పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు

• రేపు నెల్లూరులో భారీ ర్యాలీ

నెల్లూరు (దర్గామిట్ట) : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావాలని చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా'ను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి జీవీ ప్రసాద్ తెలిపారు. నగరంలోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో యువజన విభాగం జిల్లా నాయకులతో కలిసి వారు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయిలో యువతీ యువకులు 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో పాల్గొని, గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు. జిల్లా కేంద్రమైన నెల్లూరులో ఆదివారం సర్వోదయ కళాశాల నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించే ఆడుదాం ఆంధ్రా సంఘీభావ ర్యాలీలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా 'ఆడుదాం ఆంధ్రా' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి అంద్రా రాజశేఖర్‌రెడ్డి, జిల్లా యువజన విభాగం నాయకులు మహ్మద్‌రఫీ, వంశీ, ఎం.బాబు, అనిల్‌రెడ్డి, వేణు యాదవ్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ



నెల్లూరు రూరల్ : సౌత్‌మోపూరులోని బీసీ బాలుర హాస్టల్‌ను బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ భవనానికి జరుగుతున్న మరమ్మతులపై ఆరా తీశారు.

వాడవాడలా 'వై ఏపీ నీడ్స్ జగన్'

నెల్లూరు (స్టౌన్‌హౌస్‌పేట) : నగరంలోని పలు డివిజన్లలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ఆయా డివిజన్ల కార్పొరేటర్లు శుక్రవారం నిర్వహించారు. సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు నగర నియోజకవర్గంలోని ఆరో డివిజన్ జీనిగలవారివీధి సచివాలయంలో కార్పొరేటర్ మద్దినేని మస్తానమ్మ 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించి సంక్షేమం, అభివృద్ధి వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అలాగే 51వ డివిజన్ కపాడిపాళెం సచివాలయంలో కార్పొరేటర్ కాయల సాహిత్య 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆరో డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ

నగరపాలక సంస్థలో కారుణ్య నియామకం

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు నగరపాలక సంస్థలోని పబ్లిక్ హెల్త్ విభాగంలో వర్కర్‌గా ఈగా శ్రీనివాసులుకు బాధ్యతలు కల్పిస్తూ కమిషనర్ వికాస్‌మర్మత్ కారుణ్య నియామక ఉత్తర్వులు శుక్రవారం అందజేశారు. విధి నిర్వహణలో అనునిత్యం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. తనకు ఉద్యోగ అవకాశం కల్పించినందుకు కమిషనర్‌కు శ్రీనివాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వ్యర్థాల తొలగింపు



నెల్లూరు (టౌన్) : ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా పదో ఆంధ్ర నావెల్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక బీవీనగర్‌లోని కేఏన్నార్ స్కూల్ క్యాడెట్లు దర్గామిట్టలోని స్వర్ణాల చెరువు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు గుండాల నరేంద్రబాబు, అల్లు ఈశ్వరరావు పాల్గొన్నారు.

రూరల్ అభివృద్ధికి కృషి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నగరంలోని 12వ డివిజన్ వావిలేటిపాడులో రూ.30 లక్షల వ్యయంతో సీసీరోడ్డుకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నాయన్నారు. తాను సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రూరల్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు, ఆయా ప్రాంతాల అభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం

రూరల్ నియోజకవర్గంలో తుఫాన్ కారణంగా ఇబ్బందులు పడిన బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. 24వ డివిజన్ ఆర్‌డీటీ కాలనీలో వరద బాధితులకు శుక్రవారం ప్రభుత్వ సాయాన్ని అందజేశారు. రూ.2,500 నగదు, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. ఈ ప్రాంతంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి సమస్యలు లేకుండా చూస్తామన్నారు.



వరద సాయం అందజేత

గీతా జయంతి వేడుకలు నేడు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నజీర్‌బాషా గురూజీ

నెల్లూరు(బృందావనం) : నగరంలోని సుజాతమ్మ కాలనీలో ఉన్న శ్రీరాధాకృష్ణ ధ్యాన మందిరంలో గీతా జయంతి వేడుకలను శనివారం నిర్వహిస్తున్నట్లు గీతా వైభవ ట్రస్ట్ చైర్మన్ షేక్.నజీర్‌బాషా గురూజీ తెలిపారు. మూలాపేటలోని శివగిరి కాలనీలో ఉన్న ట్రస్ట్ కార్యాలయంలో 'గీతా వైభవమే భారత వైభవం' ఆహ్వాన పత్రికలను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక ప్రగతి కోసం గీతా వైభవ్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో 1,500 మంది విద్యార్థులతో వివిధ కార్యక్రమాలను వేడుకగా చేపట్టనున్నట్లు వివరించారు. రామ్‌నగర్‌లోని శబరి శ్రీరామక్షేత్రం నుంచి ధ్యాన మందిరం వరకు నగర సంకీర్తన జరుగుతుందన్నారు. సమావేశంలో ట్రస్ట్ కోశాధికారి పి.రాజారామ్, సభ్యులు మెంటా లక్ష్మీకుమారి, టి.ప్రభావతి, జి.లీలావతి, ఎన్వీ సుశీల, టి.మహాలక్ష్మి పాల్గొన్నారు.

అల్లీపురంలో రైతు దినోత్సవం

నెల్లూరు రూరల్ : రూరల్ పరిధిలోని అల్లీపురం స్టేట్ బ్యాంక్‌లో జాతీయ రైతు దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో ఎస్‌బీఐ నెల్లూరు రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొని, రైతులకు అందిస్తున్న రుణ సదుపాయాలను వివరించారు. వ్యవసాయ రంగానికి తమ బ్యాంకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. అనంతరం రైతులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. బ్రాంచ్ మేనేజర్ దేవేంద్రనాథ్, ఫీల్డ్ ఆఫీసర్ శారద, సిబ్బంది మస్తాన్‌బాబు, ప్రసన్నకృష్ణ, సుధీర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం

సంగీత విభావరి రేపు

నెల్లూరు(బృందావనం) : పుర మందిరంలో ప్రముఖ సినీగాయకుడు మహ్మద్‌రఫీని స్మరిస్తూ సంగీత విభావరి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు మదర్ భానూబి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. పురమందిరం ప్రాంగణంలో సంగీత విభావరి ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్ట్ 17వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అలాగే శాస్త్రీయ, జానపద, సినీనృత్యాలు, పాటల పోటీలు, కళా ప్రదర్శనలు జరుగుతాయన్నారు. సమావేశంలో వివిధ సంస్థలకు చెందిన నిర్వాహకులు పి.అమానుల్లాఖాన్, దగ్గుపాటి రాధాకృష్ణ, బెల్లంకొండ నాగరాజు, ఎన్వీ రమణయ్య, విన్నకోట మహేష్ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నూతన కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ధర్మకర్తల మండలి నూతన కార్యవర్గం ఎంపికైంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు దేవస్థానం ఈఓ డి.వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులుగా మంచికంటి శ్రీనివాసులు, పిన్నపరెడ్డి రాజేంద్ర, వేలూరు శ్రీనివాసులు, గోపి, రమణయ్య, మాధవి, లక్ష్మి, ప్రియాంక, పద్మజ, ఉప ప్రధాన అర్చకుడు ఈ.దొరస్వామిని ఎక్స్ అఫిషియో సభ్యులుగా నియామకం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. కాగా ధర్మకర్తల మండలి చైర్మన్‌గా మంచికంటి శ్రీనివాసులును ఎన్నుకోనున్నారని తెలిసింది.